SANKALPA
A Multidisciplinary Journal of TGTWREIS

Open Access
Review Article

# దళిత చైతన్యమూర్తి జాషువా

**Myadari Manisha***
*Lecturer, TGTWRDC(B), Karimnagar, Telangana, India*

తెలుగు సాహిత్యంలో దళిత వేదనకు, ప్రతిఘటన చైతన్యానికి ప్రతినిధి గుర్రం జాషువా. బాల్యంలో అనుభవించిన పేదరికం. కులమత భేదాలు, అవమానాల్లోంచి జాషువా కవిగా రూపాంతరం చెందాడు. ప్రాచీన పద్య ప్రక్రియలో ఆధునిక చైతన్య భావాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దిన కవి. తన కవిత్వం ద్వారా విశ్వనరుడిగా మానవాళికి గొప్ప మానవతా సందేశాన్ని అందించాడు.

జాషువా చిన్నతనం నుండి పడిన కష్టాలు, చూసిన సంఘటనల గురించి సమాజంలో ఉన్న అసమానతల గురించి ఆలోచించాడు. కర్షకుల చెమట చుక్కలు ఆవిరైపోతున్నందుకు మదనపడ్డాడు. పైసలు ఉన్నవాడికి పరపతి ఉంది, ఏమి లేని వాడికి ఏది లేదు అని, ఇవి రెండూ కలవని సమాంతర రేఖలుగా గుర్తించాడు. అంతటితో ఆగకుండా ప్రశ్నించడం మొదలుపెట్టాడు. ఇది పెత్తందారుల కుట్ర అని చాటాడు. నోరులేని మూగజీవాలను నరకడం చూసి వ్యధపడ్డాడు.భక్తులు నదిలో వేసే నణాలను చూసి పేదల కష్టం ఈ విధంగా నీటి పాలవుతున్నందుకు బాధపడ్డాడు. వయసుమల్లిన వృద్ధులకు, వికలాంగులకు పెట్టని కూడు రాతి విగ్రహాలకు పెట్టడం చూసి మనిషిలోని రాక్షసత్వానికి కుమిలిపోయాడు. ప్రతిమల పెళ్ళి చేసే ఖర్చుతో పేదల కష్టాలు తీర్చవచ్చునని వాపోయడు. మతాల పేరుతో జరిగే మారణ హోమాలను నిరసించాడు. మూఢనమ్మకాలను వ్యతిరేకించాడు. కవిగా ప్రతి సృష్టి చేయగలనని ప్రతిజ్ఞ చేసాడు. కులమత అహంకారాలు కూలదోయడనికి కలం పట్టాడు. అట్టడుగు వర్గాలకు వేసిన తెరలు తొలగించాడు. కనుమరుగైన ప్రతిభా శక్తిని వెలుగులోకి తెచ్చాడు జాషువా.

వినుకొండ కవి సమ్మేళనంలో జాషువాని కొప్పరపు కవుల్లో ఒకరికి పరిచయం చేసి, అతని పద్యాలు ఉన్న కాగితాన్ని చదువుతుండగా ఆ సభలో గుసగుసలు మొదలయ్యాయి. నలుగురు నాలుగు మాటలుగ మొదలుపెట్టి పెద్ద చర్చగా చేసి రచ్చగ మార్చారు, జాషువాని అవమానించారు. అంటరానివాడికి కవి సమ్మేళనాలు అవసరమా అని హేళన చేసారు. ఇలాంటి అవమానాలు ఏన్ని ఎదురైనప్పటికీ జాషువా వెనకడుగు వేయలేదు. ప్రతిఘటించాడు, జీవితంలో జరిగిన సంఘటనలను కవిత్వంగా మార్చాడు. జీవిత సంఘర్షణ నుండే కవిత్వం పుట్టుకొచ్చి, విశ్వకవిగా, నవయుగ చక్రవర్తిగా, కావ్యలోకంలో చెరగని ముద్ర వేసుకున్నాడు.

హిందూమతం పురాతనమైనది. వర్ణాశ్రమ ధర్మాలను పెంచి పోషిస్తూ వస్తుంది. కులమతాల పేరుతో మనుషుల మధ్య మమతానురాగాలు దూరమయ్యాయి. అనురాగాలు, ఆప్యాయతలు కరువయ్యాయి. మనిషికి మనిషి సాయం చేసుకోవడం పోయి, మనిషిని మనిషి అసహ్యించుకోవడం, అంటరాని వాడిలా చూడడం, గుడిలో, బడిలో నిషేదించడం, ఇవన్నీ సమాజానికి మాయని మచ్చగా మారాయి.

1990 లో పంచముల కోసం చిలకమర్తి లక్షీనరసింహం ఒక పాఠశాల స్థాపించారు. అప్పటినుండి పంచముల కోసం కొన్ని పాఠశాలలు నెలకొన్నయి. పాఠశాలలే కాకుండా పత్రికలు కూడా నడిపారు. అదే కాలంలో కొందరు రచయితలు మానవతా దృక్పథంతో రచనలు చేయడం ప్రారంభించారు.ఏ రచనలు చేసినవాళ్ళందరూ అగ్రకులస్తులే అయినప్పటికీ పంచముల జీవన విధానం, సమస్యలపై రాశారు. 1913 లో తల్లాప్రగడ రాసిన హేలావతి, 1915 లో మంగిపూడి వెంకట శర్మ నిరుద్ధ భారతం, 1919 లో వెంకట పార్వతీశ్వర కవుల మాతృ మందిరం, 1922 లో ఉన్నవ లక్ష్మీనారాయణ, మాలపల్లి మొదలగు రచనలు అస్పృశ్యులపై వచ్చాయి. ఇందులో ఎవరూ కూడా దళిత జీవనాన్ని చవిచూడలేదు. అస్పృశ్యులపై సానుభూతితో రచనలు చేసిన రచయితలే ఎక్కువ కనిపిస్తారు తప్ప జాషువా లాంటి అస్పృశ్యతను అనుభవించి అవమానాల్ని ఎదుర్కొన్న కవి కనిపించడు. గబ్బిలం కావ్యానికి ముందు దళిత సానుభూతితో రచనలు వచ్చినప్పటికీ, ఈ కావ్యంలో చిత్రించినట్లు దళితుల జీవనాన్ని వివరించలేకపోయారు. ఇందులో దళిత స్పృహ, దళిత చైతన్యం కనిపిస్తాయి.

**ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి**

**యినుప గజ్జెల తల్లి జీవనము సేయు**

**గసిరి బుసకొట్టు నాతని గాలిసోక**

**నాల్గు పడగల హైందవ నాగరాజు**

పంచముడిని దరిద్ర దేవత నిత్యం వెంటాడుతూ పీడిస్తుంది. హిందుమతం అనే నాలుగు పడగల నాగరాజు పంచముడి గాలి సోకగానే కసిరి బుస కొడుతున్నాడు. రేయిపగలు రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడుతున్న పంచమున్ని మాత్రం దరిచేరనివ్వట్లేదని కవి ఆవేదన పొందాడు. 1941 నుండి 1943 మధ్యకాలంలో రాసిన

**Citation**: Manisha M. దళిత చైతన్యమూర్తి జాషువా. SANKALPA. 2025;1(1):1007.

**© 2025 Manisha M.** This is an open access article distributed under the terms of the Creative Commons Attribution License (CC BY 4.0), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author(s) and source are credited.

**Published on:** October 17, 2025

***Corresponding author**: myadarimanisha@gmail.com

రచనల్లో ప్రజాదరణ పొందిన కావ్యం గబ్బిలం. ఇది రెండు భాగాలుగా రూపుదిద్దుకుంది. వస్తువులో, భావ ప్రకటనలో, కవి హృదయ నివేదనలో, తెలుగు పద్య కవిత్వంలో, ఇంతటి గొప్ప కావ్యం కనిపించదు.

జాషువా గబ్బిలంలో మొత్తం భారత భూమిని సామాజిక దృష్టితో వీక్షింప చేసాడు. నిజ జీవితంలో జరిగిన ఎన్నో సంఘటనలు తన రచనల్లో కనిపిస్తాయి. గబ్బిలం కల్పిత కథ అయినప్పటికీ, వాస్తవ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుంది. కష్టాలకు, పేదరికానికి, అంటరానితనానికి లోనైన ఒక దళితుడికి అగ్రస్థానం ఇచ్చిన ఘనత కేవలం జాషువాకే దక్కింది. సమాజంలో కుల వివక్షత, అస్పృశ్యతను నిర్మూలించి, ప్రతి వ్యక్తికి సమాజంలో అసమానతలు లేని గౌరవం దక్కాలని జాషువా గబ్బిలంలో తన ఆవేదనని వ్యక్తపరిచాడు.

**ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుగాని దుః**

**ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్**

**మెదుకు విదల్పదీ భరత మేదిని ముప్పది మూడుకోట్లదే**

**వత లెగబడ్డ దేశమున భాగ్యవిహీతుల క్షుత్తులారునే**

ఈ దేశంలో ఎంతోమంది ప్రజలు పేదరికంతో బ్రతుకుతున్నారు. ఆకలితో అలమటిస్తున్నారు. కాయకష్టం చేసిన నోటికి బుక్కెడు బువ్వ దొరకని దీనస్తితిలో ఉన్నారు. సమాజంలో ప్రాణం లేని బొమ్మలకు దైవం పేరుతో పెళ్ళిళ్ళు, పూజలు అంటూ వందలు, వేలు ఖర్చుపెట్టి పాలు పండ్లు పలహారాలన్ని నేల పాలు చేస్తున్నారు. 33 కోట్ల దేవతలు ఎగబడ్డ ఈ దేశంలో పేద ప్రజల ఆకలి ఏ విధంగా తీరుతుందని ఆకలి శోకాన్ని వినిపించాడు జాషువా.

**వాని తలమీద బులిమిన పంకిలమును**

**గడిగి కరుణింప లేదయ్యె గగనగంగ**

గంగలో మునిగితే పాపాలన్ని పోయి పుణ్యం కలుగుతంది అంటారు. అలాంటి ఆకాశగంగ కూడా ఆ పంచముది నెత్తిమీద హైందవ సమాజం పులిమిన బురదను కడిగి వేయడానికి దయ చూపించట్లేదు అని జాషువా వర్ణవ్యవస్థలోని అమానుషత్వాన్ని వివరిస్తూ వాపోతాడు. జాషువా ఎదుర్కొన్న సమస్యలు, అవమానాలన్నీ, దళిత కవితా రచనకు భూమికగా ఆయన రచనల్లో కనిపిస్తాయి. కులాలు గీసుకున్న గీతల మధ్య నిలబడలేనని, కుల, వర్ణ వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించాడు. అంటరానితనం, ఆకలి, సమాజంలో చూపించే వివక్షల నుండి దళితులకు విముక్తి కల్పించడానికి జాషువా చైతన్యమూర్తిగా నిలిచాడు.

**ఉల్లేఖనాలు**

1. గుర్రం జాషువా గబ్బిలం. నవచేతన పబ్లిషింగ్ హౌస్.
2. డా. సుధాకర్ ఎండ్లూరి. జాషువా సాహిత్యం దృక్పథం పరిణామం. ప్రజాశక్తి బుక్ హౌస్. 2015.
3. డా. బోయ జంగయ్య. విశ్వనరుడు గుర్రం జాషువా. సంక్షిప్త జీవిత పరిచయం. నవచేతన పబ్లిషింగ్ హౌస్.